


2 రోజుల్లో ఉపాధి పనులు ప్రారంభించాలి

ప్రజాశక్తి-విజయనగరం కోట

గ్రామ సభలలో ఆమోదం పొందిన ఉపాధి పనులన్నిటినీ బుధవారం లోగా ప్రారంభించాలని కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ మండల అధికారులకు ఆదేశించారు. జనవరి నాటికి పనులన్నిటినీ ప్రారంభించవలసి ఉన్నందున అత్యంత ప్రాధాన్యత నిచ్చి ఈ పనులను పూర్తి చేయాలనీ సూచించారు. సోమవారం ఎంపిడిఒలు, ఇఒపిఆర్‌డిలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పనులపై సమీక్షించారు. ఇప్పటి వరకు 20 మండలాలు మాత్రమె వెండర్ రిజిస్ట్రేషన్ వివరాలను పంపించారని, మిగిలిన మండలాలు మంగళవారం ఉదయానికే పంపించాలని ఆదేశించారు. గ్రామ సభలలో జిల్లాలో ఉపాధి హామీ నిధులతో 2199 పనులను మజురు చేయగా 1215 పనులకు వెండర్ రిజిస్ట్రేషన్ జరిగిందని, వెండర్ రిజిస్ట్రేషన్ జరిగిన పనులను మంగళవారం నుండి ప్రారంభించాలని ఆదేశించారు. ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ ఉమా శంకర్, పంచాయతీరాజ్ ఎస్ఇ శ్రీనివాసరావు, పశు సంవర్ధక శాఖ జెడి వైవి రమణ, డ్వామా ఎఒ, డివిజినల్ పంచాయతీ అధికారి మోహనరావు పాల్గొన్నారు.

బాలికపై లైంగిక దాడి



- ఈ అమానుషాన్ని ప్రతిఒక్కరూ ఖండించాలి
- లైంగిక దాడి నిందితుడికి బెయిల్ ఇప్పించొద్దు
- మహిళాశిశు సంక్షేమ శాఖామంత్రి సంధ్యారాణి
- బాధిత బాలిక కుటుంబాన్ని పరామర్శించిన మంత్రి

ప్రజాశక్తి-విజయనగరంకోట

చిన్నారిపై లైంగిక దాడికి పాల్పడిన సంఘటన అత్యంత అమానుషమని, దీన్ని ప్రతీఒక్కరూ ఖండించాలని రాష్ట్ర గిరిజన, మహిళా శిశు సంక్షేమశాఖామంత్రి గుమ్మడి సంధ్యారాణి కోరారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా సమాజంలో మార్పు రావాల్సిన అవసరం ఉందని అన్నారు. గంట్యాడ మండలంలోని ఒక గ్రామంలో ఆదివారం అత్యాచారానికి గురై, ఘోషా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మూడున్నర ఏళ్ల బాలిక కుటుంబాన్ని మంత్రి



మీడియాతో మాట్లాడుతున్న మంత్రి సంధ్యారాణి

సంధ్యారాణి సోమవారం పరామర్శించారు. వారికి ప్రభుత్వం అన్నివిధాలా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. బాలిక ఆరోగ్య పరిస్థితిపై డాక్టర్లతో చర్చించారు. మెరుగైన చికిత్సను అందించాలని, అవసరమైన ఇతర వైద్య పరీక్షలను నిర్వహించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ మానవత్వాన్ని మంట గలిపిన ఇటువంటి మానవ మృగాలకు కఠినంగా శిక్షపడాలన్నారు. ఇలాంటి దారుణానికి పాల్పడిన నిందితుడికి బెయిల్ ఇప్పించవద్దని న్యాయవాదులకు ఆమె విజ్ఞప్తి చేశారు. ఫాస్ట్‌ట్రాక్ కోర్టును ఏర్పాటు చేసి, నిందితుడికి వీలైనంత త్వరగా శిక్ష పడేవిధంగా చూడాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించినట్లు చెప్పారు. తల్లితండ్రులు ఆడపిల్లలతోపాటు మగ పిల్లలకు కూడా మంచిచెడుల విచక్షణను బోధించాలని సూచించారు. ఆడపిల్లలను రక్షించుకొనే బాధ్యత మనపై ఉందని మంత్రి అన్నారు. ఎస్‌పి వకుల్ జిందాల్ మాట్లాడుతూ, నిందితుడిని వెంటనే అదుపులోకి తీసుకున్నామని, అన్ని ఆధారాలను సేకరిస్తున్నామని చెప్పారు. ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఏర్పాటు చేసి, విచారణ జరిపేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. మంత్రి వెంట ఐసిడిఎస్ పీడీ మంత్రి సంధ్యారాణితోపాటు ఐసిడిఎస్ పీడీ బి.శాంతకుమారి, ఆసుపత్రి వైద్యులు ఉన్నారు.

సంఘటన జరిగిందిలా

అనకాపల్లికి చెందిన దంపతులు తన కుమార్తెతో పాటు గంట్యాడ మండలంలోని ఓ గ్రామానికి ఆదివారం ఫంక్షన్‌కు వెళ్లారు. అందరూ ఆ ఫంక్షన్ హడావుడిలో ఉండగా, అదే గ్రామానికి చెందిన రవి అనే యువకుడు ఆ బాలికను సమీపంలోని తోటలోకి తీసుకెళ్లి అఘాయిత్యానికి పాల్పడ్డాడు. స్థానికులు గమనించి ఆయువకుడికి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. మహిళా పోలీసుస్టేషన్ సిఐ నర్సింహమూర్తి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బాధ్యులను కఠినంగా శిక్షించాలి

మంత్రి కొండపల్లి

చిన్నారిపై జరిగిన దాడిని ఖండిస్తున్నానని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. అమరావతిలో ఉన్న మంత్రి ఈ సంఘటన వివరాలు తెలుసుకుని సభ్య సమాజం తలదించుకునే ఇలాంటి సంఘటనలు జరగడం బాధాకరమని అన్నారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించారు. ఎస్‌టి కమిషన్ చైర్మన్ డివిజి శంకర్రావు ఈ సంఘటనపై దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

పునరావృతం కానివ్వొద్దు

జెడ్‌పి చైర్మన్ శ్రీనివాసరావు

విజయనగరం టౌన్ : చిన్నారిపై అకృత్యానికి పాల్పడిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. సంఘటనను ఆయన తీవ్రంగా ఖండించారు. ఇటువంటి సంఘటనలు పునరావతం కాకుండా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు. బాధిత కుటుంబానికి సానుభూతి తెలిపారు.

ఎంఆర్ కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన విద్యార్థుల ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విద్యార్థుల నుంచి ప్రైవేటు కాలేజీ యాజమాన్యాలు ఫీజులు అడగొద్దని, ప్రభుత్వం త్వరలో విడుదల చేస్తుందని రాష్ట్రమంత్రులు, జిల్లా అధికార యంత్రాంగం చెప్పినప్పటికీ ఎంఆర్ కళాశాల మంత్రులు ,జిల్లా అధికారులు చెప్పిన ఎమ్మార్ కాలేజీ యాజమాన్యం ఫీజుల కోసం ఇబ్బందులు పెట్టడాన్ని నిరసిస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన విద్యార్థులు సోమవారం ఆందోళన చేపట్టారు. వెంటనే యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ ఐ జిల్లా కార్యదర్శి సి హెచ్ వెంకటేష్ డిమాండ్ చేశారు. తొలుత ఎంఆర్ కళాశాల వద్ద నిరసన తెలిపారపు. యాజమాన్యం పట్టించుకోకపోవడంతో విద్యార్థులు కళాశాల నుంచి కలెక్టరేట్ కు ర్యాలీగా చేరుకొని ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగావెంకటేష్



కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న విద్యార్థులు

మాట్లాడుతూకాలేజీ యాజమాన్యం విద్యార్దులను ఫీజులు కట్టకపోతే బెదిరింపులకు పాల్పడుతుందని అన్నారు. వెంటనే కలెక్టర్ కలుగుచేసుకొని యాజమాన్యానికి ఆదేశాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ధర్నాలో ఎస్ఎఫ్ఐ నాయకులు రమేష్, రోజీ, సోమేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

టిడిఆర్ బాండ్లపై విజిలెన్స్ దర్యాప్తు

ప్రజాశక్తి-బొబ్బిలి

మున్సిపాలిటీలో టిడిఆర్ బాండ్లపై విజిలెన్స్ అధికారులు సోమవారం దర్యాప్తు చేశారు. టిడిఆర్ బాండ్ల జారీలో అక్రమాలు జరిగినట్లు రాష్ట్ర వ్యాప్తంగా ఆరోపణలు రావడంతో విజిలెన్స్ సిఐ బి.సింహాచలం, అసిస్టెంట్ డిఇ జి.ప్రేమ్‌కుమార్, టిపిఒ రేవతి ఇంటింటికీ వెళ్లి దర్యాప్తు నిర్వహించారు. బలిజిపేట రోడ్డు విస్తరణలో రహదారికి ఇరువైపులా ఇళ్లు కోల్పోయిన బాధితుల ఇళ్లకు వెళ్లారు. ఎంత విస్తీర్ణంలో ఇల్లు కోల్పోయారు, ఎంత విలువ కలిగిన టిడిఆర్ బాండ్లు జారీ చేశారో వివరాలు సేకరించారు. దర్యాప్తు నివేదికను ప్రభుత్వానికి అందజేస్తామని విజిలెన్స్ అధికారులు చెప్పారు.

ఎస్‌పి గ్రీవెన్సుకు 32 వినతులు

విజయనగరం కోట : జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్‌పి వకుల్‌జిజందాల్ నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు ప్రజల నుండి 32 వినతులు వచ్చాయి. ఈ సందర్భంగా ఎస్‌పి వాటికి సంబంధించి ఆయా పరిధిలోని పోలీసు అధికారులతో మాట్లాడారు. చట్ట పరిధిలో చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎఎస్‌పి పి.సౌమ్యలత, ఎస్‌బి సిఐ ఎ.లీలారావు, డిసిఆర్‌బి ఎస్ఐ రాజేష్ పాల్గొన్నారు.

ఎఆర్ ఎఎస్‌పిగా నాగేశ్వరరావు

ప్రజాశక్తి-విజయనగరంకోట

ఆర్మ్‌డ్ రిజర్వు అదనపు ఎస్‌పిగా నియమితులైన జి.నాగేశ్వరరావు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్‌పి వకుల్‌జిందాల్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు.

లాంగ్వేజ్ పండిట్ వ్యవస్థను పునరుద్ధరించాలని ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం రద్దు చేసిన లాంగ్వేజ్ పండిట్ వ్యవస్థను పునరుద్ధరించాలని పండిట్ అభ్యర్థులు డిమాండ్ చేశారు. సోమవారం పండిట్ శిక్షణ పొందిన నిరుద్యోగ ఉపాధ్యాయు అభ్యర్థులు కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. అభ్యర్థులు కె.శ్రీనివాసరావు, ఎన్.సంతోష్ కుమార్, పి.సత్యనారాయణ లు మాట్లాడుతూ రాష్ట్రంలో 50వేల మంది, జిల్లాలో వేలాది మంది పండిట్ శిక్షణ పొందిన నిరుద్యోగ ఉపాధ్యాయ అభ్యర్థులు ఉన్నారన్నారు. గత ప్రభుత్వం లాంగ్వేజ్ పండిట్ వ్యవస్థను రద్దు చేసిందని తెలిపారు. ప్రభుత్వం తమ వేదనను అర్థం చేసుకొని త్వరలో నిర్వహించే డిఎస్‌సిలో పోస్టులు కేటాయించి న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు.

పాలకు గిట్టుబాటు ధర ఇవ్వాలి

ఎపి పాల రైతు సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి అజయ్‌కుమార్



పాల రైతులతో మాట్లాడుతున్న అజయ్‌కుమార్

ప్రజాశక్తి-బొబ్బిలిరూరల్

విశాఖ డెయిరీ యాజమాన్యం ఆవు పాల ధరను యథాతథంగా పునరుద్ధరించి, పాలకు గిట్టుబాటు ధర ప్రకటించాలని ఎపి పాల రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.అజయ్ కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని రంగరాయపురంలో రైతులతో ఆయన మాట్లాడారు. విశాఖ డెయిరీ యాజమాన్యం ఆవు పాల ధర తగ్గించిందని తెలిపారు. డెయిరీకి వచ్చిన లాభాలను యాజమాన్యం ప్రతి ఏటా వందలాది కోట్ల రూపాయలు వివిధ రూపాల్లో అవినీతి, అక్రమాలకు పాల్పడి, డెయిరీకి నష్టాలు చూపిస్తున్నారని మండిపడ్డారు.

పాల కేంద్రాల్లో సిబ్బందికి కనీస వేతనం ఇవ్వడం లేదని దుయ్యబట్టారు. ఆవు పాల ధర తగ్గించడంతో పాల రైతుల ఆదాయం తగ్గిందని, మరోవైపు పశుదాణా, గడ్డి మందులు, తదితర పెట్టుబడి పెరిగిందని చెప్పారు. తగ్గించిన ఆవు పాల ధర నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని, గిట్టుబాటు ధర కల్పించాలని మంగళవారం విశాఖపట్నంలోని విశాఖ డెయిరీ వద్ద చేపట్టే మహాధర్నాకు పాడిరైతులు తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు సింగిరెడ్డి గోపాలం, జిల్లా నాయకులు రెడ్డి త్రినాథ్ పాల్గొన్నారు.

మద్యం షాపు ఎదుట మహిళల నిరసన

ప్రజాశక్తి-శృంగవరపుకోట

పట్టణంలో గౌరీశంకర్ కాలనీ వద్ద జనావాసాల మధ్య మద్యం షాపు ఏర్పాటు చేయొద్దంటూ సోమవారం మహిళలు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ టిడిపి నాయకులు బీశెట్టి అరుణకుమారి పేరుతో మంజూరైన మద్యం షాపు ద్వారా ప్రస్తుతం పట్టణంలోని విశాఖ-అరకు రహదారిలోని ఆకుల డిపో వద్ద అమ్మకాలు చేస్తున్నారని తెలిపారు. ప్రకాశం మార్కెట్ సమీపంలో ఏర్పాటు చేయడం సరికాదన్నారు. దీనివల్ల మహిళల రక్షణకు భంగం వాటిల్లే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తంచేశారు. అధికారులు స్పందించి జనావాసాల మధ్య ఉన్న మద్యం దుకాణాన్ని వెంటనే తొలగించాలని డిమాండ్‌చేశారు.



ఎస్.కోట మద్యం షాపు ఎదుట నిరసన చేపడుతున్న మహిళలు

జనావాసాల్లో ఉన్న మద్యం షాపులు తొలగించాలి

బొబ్బిలి : జనావాసాల్లో ఏర్పాటు చేసిన మద్యం షాపులను వేరే ప్రాంతానికి తరలించాలని మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ ఎక్సైజ్ అధికారులను కోరారు. మున్సిపల్ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పట్టణంలో నిత్యం జనంతో రద్దీగా ఉన్న ప్రాంతాల్లో మద్యం షాపులు ఏర్పాటు చేయడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రోడ్డు పక్కనే మద్యం షాపులు ఏర్పాటు చేయడంతో ప్రమాదాలు జరగడంతోపాటు యువత మద్యానికి ఆకర్షణకు గురయ్యే అవకాశం ఉందని చెప్పారు. ఆయనతో కౌన్సిలర్లు ఇంటి గోవింద్, ఎస్.బాబు, వైసిపి నాయకులు రాజగోపాల్ ఉన్నారు.

నేటికీ గోప్యమే

సరిగ్గా ఏడాది క్రితం... సమయం రాత్రి 7.10 గంటల కావస్తోంది. అంతలోనే కొత్తవలస మండలం కంటకాపల్లి సమీపాన రైలు ప్రమాదం జరిగిందన్న వార్త జిల్లా వాసులను ఉలికిపాటుకు గురిచేసింది. ఈ జరిగిన ఘటన ఇంకా జిల్లా ప్రజల కళ్ల ముందు కదలాడుతునే ఉంది. ఈ ప్రమాదాన్ని తలచుకొని ఇప్పటికీ జిల్లా ప్రజలు గగుర్పాటుకు గురవుతున్నారు. ఆ ఘటనలో 13 మంది మృతి చెందగా 39 మంది తీవ్రంగా గాయపడిన సంగతి తెలిసిందే. ఈ ఘటనపై రైల్వే బోర్డు అప్పట్లో ఉన్నత స్థాయి అధికారులతో విచారణ చేపట్టినప్పటికీ ఇప్పటికీ ఆ నివేదిక బయటపెట్టకపోవడం గమనార్హం.

- కంటకాపల్లి రైలు ప్రమాదానికి ఏడాది
- నివేదిక బయటపెట్టని రైల్వే శాఖ
- అప్పట్లో 17 మంది మృతి



పట్టాలపై చెల్లాచెదురుగా పడిన రైలు బోగీలు(ఫైల్)

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

గత అక్టోబర్ 29న ఓవైపు విజయనగరంలో జరుగుతున్న ఉత్సవాలు, పైడితల్లి అమ్మవారి పండగలో అధికార యంత్రాంగం, ప్రజాప్రతినిధులు నిమగ్నమైన వేళ కంటకాపల్లి రైల్వేస్టేషన్ దాటాక లక్కవరపుకోట మండలం భీమాళి సమీపాన రాత్రి 7.10 గంటల సమయంలో జరిగిన ఘోర రైలు ప్రమాదం చోటు చేసుకుంది. రైల్వేట్రాక్‌పై ఆగి ఉన్న విశాఖ-పలాస పాసింజర్ రైలును, ఆ వెనుక వస్తున్న విశాఖ-రాయగడ పాసింజర్ రైలు ఢీకొనడంతో పట్టాలు తప్పిన వీటి బోగీలు పక్క ట్రాక్‌పై ఉన్న గూడ్సురైలు బోగీలపైకి దూసుకెళ్లడంతో పట్టాలు పైకి లేచాయి. ఛిద్రమైన రైలు భోగీలను కట్ చేసి లోకో పైలట్ల మృతదేహంతో పాటు మరో ఇద్దరి మృతదేహాలకు బయటకు తీశారు. సంఘటనా స్థలంలో ఇద్దరు లోకో పైలట్లు, ఒక గార్డు, 12 మంది ప్రయాణికులు మృతి చెందగా, మరో ఇద్దరు ఆస్పత్రిలో కన్నుమూశారు. మృతి చెందిన వారిలో విజయనగరం జిల్లా వాసులే ఎక్కువ మంది ఉన్నారు. ఆ రాత్రివేళ జిల్లాకు చెందిన అధికారులు, ప్రజాప్రతినిధులు చూపిన చొరవ, చేపట్టిన సహాయ చర్యలు జిల్లా ప్రజలతో భేష్ అనిపించుకున్నాయి. ప్రధానంగా చుట్టు పక్కల గ్రామాల ప్రజలు పరుగున ఘటనా స్థలానికి చేరుకొని అందించిన సహాయక చర్యలు పలువురి ప్రాణాలను కాపాడాయి.

ఆటో సిగ్నల్ సిస్టంలో లోపం వల్లే

గతంలో రైలు కదలాలంటే స్టేషన్ నుంచి క్లియరెన్స్ వచ్చాకే రైలుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చేవారు. ఒక వేళ దాని ముందు మరో రైలు వెళితే, అది తరువాత స్టేషన్ చేరుకున్నాక... ఈ రైలుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చి వదిలే వారు. కానీ ఆటో మోడ్ సిగ్నల్ వచ్చాక, ఒకే లైనుపై రెండు రైళ్లను ఐదు నిముషాలు వ్యవధిలోనే గ్రీన్ సిగ్నల్ ఇచ్చి వదులుతున్నారు. దీంతో ఆయా రైళ్ల ముందున్న సిగ్నల్ ఆధారంగా రైళ్లు నడుస్తున్న పరిస్థితి. కానీ పలాస ట్రైన్ కు సిగ్నల్ లోపం వలనే ఈ ప్రమాదం జరిగినట్లు అప్పట్లో ఈ ఘటనపై నియమించిన అధికారుల బృందం తేల్చింది.

సేఫ్టీ కమిషన్ విచారణ ఏం తేల్చింది?

ఈ ఘటనకు గల కారణాలపై కమిషన్ ఆఫ్ రైల్వే సేఫ్టీ (సిఆర్ఎస్) అప్పట్లోనే విచారణ చేపట్టింది. 10 మంది బృందం ఈ ప్రాంతంలో అప్పట్లో పర్యటన చేసింది. ముఖ్యంగా కమిషనర్ ఆఫ్ రైల్వే సేఫ్టీ (నార్త్ ఈస్ట్ సర్కిల్) ప్రంజీవ్ సక్సేనా కొన్ని ప్రాథమిక నిర్ధారణలు చేశారు. ఈ ప్రమాద వైఫల్యాలపై అప్పట్లో స్పందిస్తూ రైల్వే అడ్మినిస్ట్రేషన్ వైఫల్యం దీంట్లో ఉందని, ఘటన జరిగినాక నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్సెస్ పనితనం నైపుణ్య వంతంగా లేదని ఘాటు వ్యాఖ్య చేశారు. నేరుగా రైల్వే బోర్డు నుంచే వీరు విచ్చేశారు. నివేదిక కూడా అక్కడే సమర్పించారు. కానీ నేటికీ ఆ నివేదికను బయటపెట్టలేదు. ఆటోమేటిక్ సిగ్నల్‌ను దాటుకుంటూ లోకోమోటివ్ పైలట్ డేంజర్ సిగ్నల్ చూడకుండా వెళ్లిపోయారని నివేదించారు. అసిస్టెంట్ లోకో పైలట్ ట్రైన్ నెం.08504 ఎమర్జెన్సీ బ్రేక్‌లు వేయలేకపోయాడని పేర్కొన్నారు. కానీ దీంట్లో పైలట్ తప్పేలేదని లోకో రన్నింగ్ స్టాఫ్ అసోసియేషన్ క్లెయిమ్ చేసింది. రైల్వే బోర్డుతోనూ ఈ అంశంపై పోరాడడంతో కమిషన్ నివేదిక తప్పు అని తేలింది. రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ 'ఆరోజు క్రికెట్‌మ్యాచ్ జరుగుతుండడంతో పైలట్‌లు ఆ మ్యాచ్ చూసుకుంటూ యాక్సిడెంట్ చేశారంటూ వ్యాఖ్యలు చేయడంపైనా రైల్వే సంఘాలు భగ్గుమన్నాయి. ఆ తరువాత వాస్తవాలను బయటపెడతామంటూ రైల్వే శాఖ ప్రకటించినప్పటికీ ఆచరణలో గోప్యంగా ఉంచింది.

అసలు కారణం ఇదీ

వాస్తవానికి 'అమృత్ భారత్ పథకం' నిధుల ఖర్చులో రైల్వేలో భద్రత, మౌలిక వసతుల కల్పనకు పూర్తిస్థాయిలో వెచ్చించడం లేదన్న విమర్శలు నానాటికీ పెరుగుతున్నాయి. సిగ్నలింగ్ వ్యవస్థలను బలోపేతం చేయడం, ట్రాక్‌లపై రైళ్లకు మధ్య సరైన దూరం ఉండేలా చర్యలు వంటివి తీసుకోవాల్సి ఉంది.

నిబంధనల మేరకే బాణసంచా దుకాణాలకు అనుమతులు

దీపావళి సందర్భంగా ఏ ఒక్క ఘటన జరగడానికి వీల్లేదు : కలెక్టర్ బి.ఆర్.అంబేద్కర్

ప్రజాశక్తి-విజయనగరంకోట

జిల్లాలో బాణసంచా విక్రయాల కోసం నిబంధనలు ప్రకారం అనుమతులు మంజూరు చేయాలని కలెక్టర్ బి.ఆర్.అంబేద్కర్ అధికారులను ఆదేశించారు. నిబంధనలకు విరుద్ధంగా ఏ షాపు ఏర్పాటుకూ అనుమతులు మంజూరు చేయవద్దని స్పష్టంచేశారు. రెవిన్యూ, పోలీసు, అగ్నిమాపక శాఖల అధికారులు సంయుక్తంగా తనిఖీచేసి అన్ని నిబంధనలు పాటించినట్టు ధ్రువీకరించిన తర్వాత మాత్రమే దుకాణాల ఏర్పాటుకు తాత్కాలిక లైసెన్సులు మంజూరు చేయాలని చెప్పారు.



అర్జీలను పరిశీలిస్తున్న కలెక్టర్ అంబేద్కర్

బాణసంచా పేలుడు వంటి ఘటనలు జరిగితే వాటి ఏర్పాటుకు ధ్రు వీకరించిన అధికారులే బాధ్యత వహించవలసి వుంటుందన్నారు. సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా అధికారులతో నేరుగాను, ఆర్‌డిఒలు, తహశీల్దార్‌లతో వీడియో కాన్ఫరెన్సు ద్వారా మాట్లాడారు. దీపావళి సందర్భంగా జిల్లాలో ఎక్కడా బాణసంచా విక్రయాల వల్ల ప్రమాదాలు జరగడానికి వీల్లేదని చెప్పారు. విజయనగరంలో ఒకే చోట కాకుండా మూడు లేదా నాలుగు ప్రదేశాల్లో విక్రయాలకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఆర్‌డిఒ, డిఎస్‌పి, జిల్లా ఫైర్ ఆఫీసర్‌లు సంయుక్తంగా పరిశీలన జరిపి బాణసంచా విక్రయాలకు ప్రదేశాలను ఎంపిక చేయాలన్నారు. జిల్లాలో ఈ నెలాఖరు వరకు గ్రామాల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక డ్రైవ్‌ను కొనసాగించాలని కలెక్టర్ ఆదేశించారు.

వినతుల పరిష్కార వేదికకు 220 అర్జీలు

ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్.సేతు మాధవన్, డిఆర్ఒ శ్రీనివాసమూర్తితో కలసి వినతులను స్వీకరించారు. ఈ వారం 220 వినతులు వచ్చాయి. వీటిని ఆయా శాఖల జిల్లా అధికారులకు పంపించి పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. మండల స్థాయిలో పరిష్కరించాల్సిన వినతులపై ఆయా మండలాల తహశీల్దార్‌లు, ఎంపిడిఒలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడి ఆయా వినతితులను పరిష్కరించాలని ఆదేశాలిచ్చారు. వినతుల పరిష్కార వేదికలో మొత్తం 220 వినతులు అందాయి. ఇందులో రెవిన్యూ శాఖకు సంబంధించినవి 161, డిఆర్‌డిఎకు 12, జిల్లాపంచాయతీ అధికారికి 12, గ్రామవార్డు సచివాలయ శాఖకు 9, నగరపాలక సంస్థకు 7, విద్యా శాఖకు 5, వైద్య ఆరోగ్యశాఖకు 4, డిసిహెచ్ఎస్ 3, ఇపిడిసిఎల్‌కు 3 వంతున వినతులు అందాయి.

రబీలో నీరు అందించాలి

రబీలో సాగునీరందించాలని మడ్డువలస ఆయకట్టు రైతులు సోమవారం గ్రీవెన్సులో కలెక్టర్ అంబేద్కర్‌కు వినతినిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మడ్డువలస ప్రాజెక్టు ఆయకట్టు కింద ఉన్న మామిడిపల్లి, జి.శిగడాం తదితర మండలాల రైతులు ఆరుతడి పంటల మీదే ఆధారపడి జీవిస్తున్నామన్నారు. పశువులు, గొర్రెలు మేకలు ఇలా పశు సంపదంతా ఈ నీటిపైనే ఆధారపడి జీవిస్తున్నాయన్నారు సాగునీటి సమస్య శాశ్వతంగా పరిష్కారం కావాలంటే ప్రత్యేకమైన గెజిట్ పబ్లికేషన్ ఇచ్చి పరిష్కరించాలని కోరారు.

సమస్యల పరిష్కారం కోసం మారిక గిరిజనుల వినతి

వేపాడ : తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన గ్రీవెన్స్‌లో వేపాడ మండలంలోని మారిక గిరిజనులు కలెక్టర్ అంబేద్కర్‌కు వినతి అందించారు. స్పందించిన కలెక్టర్ పంచాయతీరాజ్ శాఖ డిఇని పిలిచి, మారిక రోడ్డు పనులు నిలిచిపోవడానికి కారణాలు అడిగి తెలుసుకున్నారు. కాంట్రాక్టరుకు బకాయి రూ.75 లక్షలు చెల్లించామని, నాలుగు రోజుల్లో రోడ్డు పనులు ప్రారంభిస్తారని కలెక్టర్‌కు డిఇ వివరించారు. మారికలో పాఠశాల భవనం మంజూరైనా నిర్మాణం చేపట్టకపోవడంపై డిఇఒను పిలిచి కలెక్టర్ మాట్లాడారు. పాఠశాలకు మంజూరైన నాడు-నేడు నిధులు ఏమయ్యాయో క్షేత్రస్థాయిలో పరిశీలించి, నివేదిక ఇవ్వాలని డిఇఒను ఆదేశించారు.

తాగునీటికి ఇబ్బందులు..

వేపాడ మండలం సింగరాయి గ్రామంలో ఎస్‌సి కాలనీలో తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, మినీ రక్షిత తాగునీటి పథకం మంజూరు చేయాలని సామాజిక కార్యకర్త రిక్కి అప్పారావు.. కలెక్టర్‌కు వినతి అందించారు. వెంటనే కలెక్టర్ స్పందిస్తూ ఆర్‌డబ్ల్యుఎస్ డిఇని పిలిచి, ప్రతిపాదనలు తయారు చేయాలని ఆదేశించారు.

ఎల్ఐసి ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఎల్ఐసిలో ఇటీవల యాజమాన్యం ప్రవేశపెట్టిన మార్పులను రద్దు చేసే వరకు పోరాటం కొనసాగిస్తామని ఐఆర్ డిఎ రాజకీయ వ్యవహారాల చైర్మన్ ఎన్.గజపతిరావు తెలిపారు. లైఫ్ ఇన్సూరెన్స్ ఏజెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (లియాఫీ) ఆధ్వర్యంలో సోమవారం ఎల్ఐసి విజయనగరం బ్రాంచ్ కార్యాలయం వద్ద ఉద్యోగులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా గజపతిరావు మాట్లాడుతూ ఇటీవల యాజమాన్యం తీసుకున్న తిరోగమన నిర్ణయాల వల్ల ఏజెంట్ల మనుగడ ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఎల్ఐసిని నిర్వీర్యం చేసేందుకు యాజమాన్యం కుట్ర పన్నుతుందని ఆరోపించారు. కేంద్రప్రభుత్వం అందరికీ భీమా కల్పించాలని నిర్ణయించినప్పటికీ ఎల్ఐసి పాలసీ ప్రీమియం పెంచడం దారుణమన్నారు. ఏజెంట్లకు నష్టం చేకూర్చే క్లాబ్లాక్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో ఆలిండియా కమిటీ సభ్యుడు కెవి రమణ, జోనల్ కమిటీ సభ్యుడు బడ్డుకొండ వెంకట రమణ, బ్రాంచ్ అధ్యక్షుడు చిల్లా రామకష్ణ, కార్యదర్శి ఇల్లాపు కృష్ణ, కోశాధికారి తుమ్మలగుంటి పవన్ కుమార్, యూనియన్ గౌరవ అధ్యక్షుడు సబ్బవరపు సూరినాయుడు, డివిజన్ ఉపాధ్యక్షుడు జె.వాసుదేవరావు పాల్గొన్నారు.

శృంగవరపుకోట : స్థానిక ఎల్ఐసి బ్రాంచి కార్యాలయం ఎదుట సోమవారం ఏజెంట్లు ధర్నా చేశారు. ఎల్ఐసిని నిర్వీర్యం చేయడంలో భాగంగానే ఏజెంట్లు, ఖాతాదారులపై యాజమాన్యం భారాలు మోపుతోందని ఎల్ఐసి ఏజెంట్ల అసోసియేషన్ బ్రాంచి అధ్యక్షులు సూర్యనారాయణ, కార్యదర్శి సన్యాసిదేవుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డివిజన్ జాయింట్ సెక్రటరీ కె.కె.నాయుడు, జోనల్ వైస్ ప్రెసిడెంట్ కెఎస్‌హెచ్ మోహన్, ఏజెంట్లు జి.వి.సత్యం, కె.ఎ.రామారావు, పోతన్న, అప్పలస్వామి, వెంకట్రావు, ప్రసాద్ పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న ఎల్ఐసి ఉద్యోగులు



ధర్నా చేస్తున్న ఎండిఎం కార్మికులు

సమస్యలపై ఎండిఎం కార్మికుల ధర్నా

ప్రజాశక్తి-శృంగవరపుకోట

తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం ఎంఇఒ కార్యాలయం వద్ద మధ్యాహ్న భోజన కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిర్వాహకులు ధర్నా చేశారు. అనంతరం ఎంఇఒ నర్సింగరావుకు వినతి అందించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి మద్దిల రమణ మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం మధ్యాహ్న భోజన కార్మికులకు 18 వేలు వేతనం ఇవ్వాలని డిమాండ్‌చేశారు. మెనూ ఛార్జీలు పెంచాలని, గ్యాస్ సిలిండర్ ప్రభుత్వమే సరఫరా చేయాలని, మధ్యాహ్న భోజన కార్మికుల అక్రమ తొలగింపులు, వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికులు ఎ.భవాని, పి.కృష్ణమ్మ, జె.సన్యాసమ్మ, కె.అచ్చియమ్మ, జి.భవాని, సి.హెచ్. ఎర్రయమ్మ, పి.ఈశ్వరమ్మ, ఎస్.అమ్మాజీ, పాల్గొన్నారు.

మౌనికకు ఎమ్మెల్యే ఆర్థిక సాయం

ప్రజాశక్తి-రామభద్రపురం

క్రీడల్లో ప్రతిభ చూపిన కొట్టక్కి గ్రామానికి చెందిన మౌనికకు ఎమ్మెల్యే బేబినాయన రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. కొట్టక్కి హైస్కూల్లో చదువుతున్న మౌనిక ఇటీవల జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలుసుకున్న ఎమ్మెల్యే సోమవారం ఆమెను అభినందిస్తూ నగదు అందజేశారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు మడక తిరుపతినాయుడు, ప్రధానోపాధ్యాయులు రావాడ భాస్కరరావు, పిఇటి బొత్స రత్నకిశోర్, టిడిపి నాయకులు ముల్లు రాంబాబు, ఉపాధ్యాయులు కొల్లి ఈశ్వరరావు పాల్గొన్నారు.

అనుమతి లేకుండా పనులు చేస్తే చర్యలు

ప్రజాశక్తి-శృంగవరపుకోట

కోర్టులో కేసు ఉండగా లేఅవుట్‌లో పనులు చేపడితే చర్యలు తప్పవని తహశీల్దార్ అరుణకుమారి హెచ్చరించారు. శనివారం మండలంలోని ముసిడిపల్లి పంచాయతీలో ఉన్న లేఅవుట్‌ను ఆమె పరిశీలించారు. ఈ లేఅవుట్ వద్ద కోర్టు పరిధిలో ఉన్న స్థలంలో పనులు చేపడుతున్నారని కొంతమంది ఫిర్యాదు చేయడంతో తహశీల్దార్ అక్కడికి చేరుకున్నారు. పనులు చేస్తున్న వాహన తాళాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ లేఅవుట్ రోడ్డు.. డి-పట్టా భూమి, చెరువులో ఉందని, దీనిపై ఆర్‌డిఒ విచారణ చేశారని తహశీల్దార్ తెలిపారు. ఇటువంటి ప్రదేశంలో పనులు చేయవద్దని హెచ్చరించారు.

గ్రామాల్లో పారిశుధ్య పనులు

తెర్లాం : మండలంలోని పణుకువలస సచివాలయ పరిధిలోని పలు గ్రామాల్లో సోమవారం పారిశుధ్య పనులు చేపట్టారు. కాలువల్లో పూడిక తీశారు. కాలువలు, ప్రధాన కూడళ్లు, నీటి నిల్వలు ఉన్న స్థలాల్లో బ్లీచింగ్ చల్లారు. ఈ పనులను సర్పంచ్ రమణమూర్తి, పంచాయతీ కార్యదర్శి కె.ప్రసాదరావు పర్యవేక్షించారు.పెరుమాళి, జగన్నాధవలస, లీకటిపేట, కెకరేవలస, బూరిపేట, సుందరాడ, తదితర గ్రామాల్లో యుద్ధ ప్రాతిపదికన పూడికలు తొలగిస్తున్నారు.

పాఠశాల సందర్శన

వేపాడ : మండలంలోని సోంపురం గ్రామంలో ప్రాథమిక పాఠశాలను సోమవారం ఎంఇఒ బాలభాస్కరరావు సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణను పరిశీలించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు, సిఆర్‌పి రాంప్రసాద్ పాల్గొన్నారు.

విద్యార్థులకు వక్తృత్వ, వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి-విజయనగరం కోట

మహాకవి గురజాడ వెంకట అప్పారావు వర్ధంతిని పురస్కరించుకొని జిల్లా స్థాయిలో ఉన్నత పాఠశాల విద్యార్థులకు గురజాడ సాంస్కృతిక సమాఖ్య ఆధ్వర్యంలో వక్తృత్వం, వ్యాసరచన పోటీలను జిల్లాస్థాయిలో సోమవారం గురజాడ స్మారక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహించారు. ఈ పోటీలకు జిల్లా వ్యాప్తంగా సుమారుగా 600మంది విద్యార్థులు హాజరయ్యారు. కార్యక్రమంలో గురజాడ సాంస్కృతిక సమాఖ్య కార్యదర్శి కాపుగంటి ప్రకాష్, గురజాడ ఇందిర, డాక్టర్ గోపాలరావు, సూర్యలక్ష్మి, ఆధ్య విజయ్ కుమార్, మానాప్రగడ సాహితీ సన్యాసిరావు రాజేశ్వర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో ఫీవర్ సర్వే

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలో ఫీవర్ సర్వే ముమ్మరం గా సాగుతోంది. 61 సచివాలయాల పరిధిలో సిబ్బంది టీమ్‌లు వారీగా ఏర్పడి ఇంటింటికి వెళ్లి ఫీవర్ సర్వే చేపడుతున్నారు. ఎఎన్‌ఎంలు, ఎమినిటీస్ మరియు హెల్త్ సెక్రటరీలు బృందంగా వెళ్లి ఫీవర్ సర్వే తో పాటు మంచినీటి నాణ్యత పరీక్షలు, పరిసర ప్రాంతాలు పరిశుభ్రత వరంగా ఏ విధంగా ఉన్నాయో వంటి వివరాలను నమోదు చేస్తున్నారు. కమిషనర్ ఆదేశాల ప్రకారం సిబ్బంది అంతా ప్రతిరోజు ఇంటింటికి వెళ్లి డయేరియా కేసులు ఏమైనా ఉన్నాయా లేదా సాధారణ జ్వరాలు ఉన్నాయా వంటి వివరాలను ఎఎన్‌ఎంలు సేకరిస్తున్నారు. హెల్త్ కార్యదర్శులు పరిసర ప్రాంతాలు పరిశుభ్రత, దోమలు వృద్ధి కాకుండా చేపట్టాల్సిన జాగ్రత్తలు గూర్చి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.

ఫిర్యాదులు పరిష్కార వేదికకు 7 వినతులు

విజయనగరం టౌన్ : విజయనగరం నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు ఏడు వినతులు వచ్చాయి. తమ సమస్యలను వివరిస్తూ అర్జీలను కమిషనర్ పి. నల్లనయ్యకు అందజేశారు. వాటిని పరిశీలించిన కమిషనర్ సంబంధిత విభాగాల అధికారులకు పంపిస్తూ నిమిత్తం ఆదేశించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్ హరిబాబు, రెవెన్యూ అధికారి శ్రీనివాసరావు, ఎఇ మూర్తి, డిఇ మణికుమార్ పాల్గొన్నారు.

41,47 డివిజన్లలో నేడు నీటి సరఫరా బంద్

విజయనగరం టౌన్ : మధుపాడ వద్ద పంపింగ్ లైన్ లీకులు ఏర్పడిన కారణంగా వాటిని మరమ్మతులు చేసేందుకు కంటోన్మెంట్ ట్యాంకు ద్వారా నీటి పంపిణీ జరిగే ప్రాంతాలలో మంగళవారం తాగునీటి సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు కమిషనర్ పి. నల్లనయ్య ఒ ప్రకటనలో తెలిపారు. 41, 47 డివిజన్ ప్రాంతాలలో సంజీవ్ నగర్ కాలనీ, గొల్ల వీధి, పార్క్ రోడ్, రెహమాన్ ఖయ్యుమ్ రోడ్డు, బజారు వీధి, గంజిపేట, బంగారమ్మ కాలనీ, గౌడుగుల వీధి, స్వీపర్ కాలనీ, కాంబోవీధి, అరుంధతి నగర్, పివిజి నగర్ ప్రాంతాలలో మంగళవారం తాగునీటి పంపిణీ నిలుపుదల చేస్తున్నట్లు తెలిపారు.

అథ్లెట్ పైడిరాజుకు విక్రమ్ అభినందనలు

విజయనగరం టౌన్ :మాస్టర్స్ అథ్లెటిక్స్ వరల్డ్ ఛాంపియన్ షిప్ లో కాంస్య పతకం సాధించిన మాస్టర్ అథ్లెట్ జరజాపు పైడిరాజు సోమవారం విజయనగరం నగరంలో సంక్షేమ సంఘం అధ్యక్షులు అవనాపు విక్రమ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ నెల 12 నుండి 19 వరకూ మలేషియా వేదికగా జరిగిన 36వ మాస్టర్స్ అథ్లెటిక్స్ వరల్డ్ ఛాంపియన్ షిప్ పోటీల్లో భారతదేశానికి ప్రాతినిధ్యం వహించిన పైడిరాజు 800 మీటర్ల లాంగ్ రన్ లో కాంస్య పతకం సాధించారు. ఈ సందర్భంగా అవనాపు విక్రమ్‌ను కలవగా ఆయన పైడిరాజును అభినందించారు. భవిష్యత్ లో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

ఉత్సాహంగా అంతర్ కళాశాలల ఫెస్ట్

ప్రజాశక్తి - నెల్లిమర్ల

సెంచూరియన్ యూనివర్సిటీలో సోమవారం అంతర్ కళాశాలల ఫెస్ట్ ఉత్సాహంగా జరిగింది. బిబిఎ విద్యార్థులు నగరంలో ఉన్న అన్ని కళాశాల నుంచి పాల్గొని 'యాడ్ మేడ్' కాంపిటీషన్‌లో పోటీ పడ్డారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల బీకాం విద్యార్థులు ముగ్గురు పాల్గొన్నారని ద్వితీయ బహుమతి సాధించారు. ఈ కాంపిటీషన్‌లో ఆదిత్య డిగ్రీ కాలేజీ, సీతం కాలేజ్, మహారాజా కాలేజ్, ఎజిఎల్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు. డిగ్రీ కళాశాల నుంచి 14 మంది విద్యార్థులు ఫెస్ట్‌లో పాల్గొన్నారు, పిఎంఎం ఖాన్, పి.అవినాష్, పూజితలు ద్వితీయ స్థానం సాధించారు. వీరికి సెంచూరియన్ వైస్ ఛాన్సలర్ చేతుల మీదుగా బహుమతి ప్రదానం చేశారు.ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె రేఖ, కామర్స్ డిపార్ట్మెంట్ ఇన్చార్జి ఈశ్వరరావు అభినందించారు.

రక్తదానం చేయండి.. ప్రాణదాతలుగా నిలవండి

ప్రజాశక్తి-విజయనగరంకోట, బొబ్బిలి

పోలీసు అమరుల వారోత్సవాల్లో భాగంగా సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలోను, బొబ్బిలి, చీపురుపల్లి కేంద్రంలోనూ రక్తదాన శిబిరాలు నిర్వహించారు. 313 యూనిట్ల రక్తం సేకరించి రక్త నిధి కేంద్రాలకు అందజేశారు. పోలీసు పరేడ్ గ్రౌండులో రోటరీ బ్లండ్ బ్యాంకు ఆధ్వర్యంలో నిర్వహించిన రక్త దాన శిబిరాన్ని ఎస్‌పి వకుల్‌జిందాల్ ప్రారంభించారు. అనంతరం ఆయన


బొబ్బిలి : రక్తదాన శిబిరాన్ని సందర్శిస్తున్న డిఎస్‌పి

మాట్లాడుతూ రక్త దానంతో ఇతరులకు ప్రాణ దానం చేసినట్లేనన్నారు. రోడ్డు ప్రమాదాలు, ఇతర అనారోగ్య పరిస్థితుల్లో ప్రాణాపాయ స్థితిలో ఉన్న వ్యక్తులను, రక్త హీనత కారణంగా ఇబ్బందులకు గురువుతున్న ప్రజల అవసరాలను దష్టిలో పెట్టుకొని, వారికి రక్తాన్ని అందించాలనే లక్ష్యంతో రక్తదాన శిబిరాన్ని నిర్వహించామన్నారు. కార్యక్రమంలో ఆర్మ్‌డ్ రిజర్వు, పలువురు పోలీసు అధికారులు, సిబ్బంది, ప్రజలు, ఎన్‌సిసి క్యాడెట్స్ పాల్గొని రక్తదానం చేసారు. వీరిని ఎస్‌పి అభినందించి రోటరీ క్లబ్ తరుపున సర్టిఫికేట్లు అందజేశారు.

పిటిసి ఆధ్వర్యాన రక్తదానం

రక్త దాతలు ప్రాణదాతలని పిటిసి ప్రిన్సిపల్ డిఆర్‌సి రాజు అన్నారు. పోలీసు అమరుల సంస్మరణ వారోత్సవాలలో భాగంగా రక్తదాన శిబిరం నిర్వహించారు. వైస్ ప్రిన్సిపాల్ పివి అప్పారావు ఈ శిబిరాన్ని ప్రారంభించారు. మొత్తం 53మంది రక్తదానం చేశారు. కార్యక్రమములో డిఎస్‌పిలు టి.రమేష్, సిఐలు, ఆర్‌ఐలు, యస్‌ఐలు, ఆర్‌యస్‌ఐలు, పిటిసి. అవుడోర్ సిబ్బంది, మినిస్టీరియల్ సిబ్బంది, అవుట్ సోర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

రక్తదాతలే ప్రాణదాతలు


రక్తదాతను అభినందిస్తున్న ఎస్‌పి వకుల్ జిందాల్

రక్తదాతలే ప్రాణదాతలని బొబ్బిలి డిఎస్‌పి పి.శ్రీనివాసరావు అన్నారు. పోలీస్ అమరుల వారోత్సవాల్లో భాగంగా పట్టణ పోలీస్ స్టేషన్లో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తం కొరతతో చాలామంది ప్రాణాలు కోల్పోతున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో రక్తం కొరతను నివారించేందుకు రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశామని చెప్పారు. రక్తదానం చేయడం వల్ల ఎటువంటి ఆరోగ్య సమస్యలూ రావని తెలిపారు. రక్తదానం చేసిన యువకులు, పోలీసు సిబ్బందిని అభినందించారు. 150 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. కార్యక్రమంలో పట్టణ సిఐ కె.సతీష్ కుమార్, ఎస్ఐలు జ్ఞానప్రసాద్, రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో రజతం

ప్రజాశక్తి- నెల్లిమర్ల


పతకం సాధించిన హేమసుందర్‌రావు

కర్నూల్‌లో ఆంధ్రప్రదేశ్ యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో గత రెండు రోజులు పాటు జరిగిన రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో నెల్లిమర్ల గాంధీ నగర్ కాలనీకి చెందిన తాతి పూడి హేమ సుందర్ రావు రజిత పథకం సాధించినట్లు కోచ్ మద్దిల సంతోషి భారతి తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీల్లో 14-18 సంవత్సరాల కేటగిరిలో హేమ సుందర్‌రావు రజిత పథకం సాధించాడని ఆమె తెలిపారు. ఫలితంగా జార్ఖండ్ రాష్ట్రంలో ధన్‌బాద్‌లో డిసెంబర్ 27, 28 తేదీల్లో జరుగునున్న జాతీయస్థాయి యోగా పోటీలకు ఎంపికయ్యాడని ఆమె తెలిపారు. హేమ సుందర్ రావు ప్రస్తుతం విజయనగరం ఎపి బిసి గురుకుల పాఠశాలలో పదవ తరగతి చదువుతున్నాడు. విద్యార్థిని పాఠశాల ఉపాధ్యాయులు భినందించారు.

ఉపాధి నిధులు పక్కదారి పట్టించొద్దు


వేపాడ.. అధికారులకు వినతి అందిస్తున్న సర్పంచులు, ఎంపిటిసిలు

ప్రజాశక్తి-శృంగవరపుకోట

పంచాయతీలకు కేటాయించిన ఉపాధి హామీ నిధులను పక్కదారి పట్టించొద్దని సర్పంచులు, ఎంపిటిసిలు.. మండల అధికారులకు సోమవారం వినతిపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా జెడ్‌పిటిసి వెంకటలక్ష్మి, ఎంపిపి-2 పినిశెట్టి రమణ మాట్లాడుతూ ఉపాధి హామీ నిధులతో గ్రామసభల తీర్మానంతోనే పనులు చేపట్టాల్సి ఉందన్నారు. గ్రామసభ తీర్మానం లేకుండా ఇతరులతో పనులను చేపట్టి, నిధులు పక్కదారి పట్టించొద్దని కోరారు. దీనిపై ఎంపిడిఒ, పంచాయతీరాజ్ జెఇ, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ, సబ్ డివిజన్ అధికారికి వినతులను అందజేశారు.

వేపాడ : ఉపాధి హామీ పనులను పంచాయతీల ద్వారానే చేపట్టాలని మండలంలోని సర్పంచులు, ఎంపిటిసిలు.. ఎంపిడిఒ సూర్యనారాయణ, ఎపిఒ, పిఆర్ జెఇని కలిసి వినతులిచ్చారు. ఆ పనుల బిల్లులు, నగదు చెల్లింపులు కూడా గ్రామ పంచాయతీ ఉపాధి హామీ బ్యాంకు అకౌంట్ ద్వారా చేపట్టాలని విజ్ఞప్తిచేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి డి.సత్యవంతుడు, జెడ్‌పిటిసి సేనాపతి అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు

పంచాయతీ ఖాతా ద్వారే పనులు

పూసపాటిరేగ: ఉపాధి హామీ ద్వారా పనులకు సంబంధించిన చెల్లింపులు గ్రామ పంచాయతీ ఉపాధి హామీ బ్యాంక్ అకౌంట్ నుంచే జరగాలని వైసిపి సర్పంచులు కోరారు. సోమవారం ఎంపిడిఒ రాధికకు గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. మంజూరైన పనులను గ్రామపంచాయతీ ద్వారానే చేపట్టేలా జరిగి, బిల్లులు కూడా ఆ అకౌంట్ నుంచే మంజూరు చేయాలని కోరారు. వినతి అందించిన వారిలో పతివాడ అప్పలనాయుడు, వైస్ ఎంపిపి అల్లాడి రమేష్, మహంతి శ్రీనివాసరావు, టొంపల సీతారాం, కొత్తకోట శ్రీరాములు, డి.గణేష్, రైతు శ్రీరామ్మూర్తి, పిన్నింటి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రామభద్రపురం : ఉపాధిహామీ ద్వారా మంజూరవుతున్న వివిధ పనులు గ్రామ పంచాయతీల ద్వారానే చేపట్టాలని సర్పంచ్‌లు డిమాండ్ చేశారు. ఎంపిడిఒ రత్నంకు వినతిపత్రం అందించారు. ఈ పనులకు సంబంధించి బిల్లులు,నగదు చెల్లింపులు కూడా గ్రామ పంచాయతీ ద్వారా ఉపాధిహామీ బ్యాంకు అకౌంట్ ఏర్పాటు చేసి దాని ద్వారానే లావాదేవీలు జరపాలని ఆరికతోట సర్పంచ్ పెంకి పుష్పమ్మ,రావివలస సర్పంచ్ ఎస్.కుమారి, దుప్పలపూడి సర్పంచ్ వైకుంఠం విజయ భాస్కరరావు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అప్పలరాజుపేట సర్పంచ్ రమ్య, జన్నివలస సర్పంచ్ సారంగిదొర తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యేకు సమస్యలపై వినతినిస్తున్న మహిళ

సమస్యల పరిష్కారానికి కృషి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-విజయనగరం కోట

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామని ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి గజపతిరాజు అన్నారు. సోమవారం స్థానిక టిడిపి కార్యాలయం అశోక్ బంగ్లాలో నిర్వహించిన ప్రజాదర్బారులో ఆమె ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. మండల పరిధిలో గల 22 గ్రామాల ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వినతులలో అధిక భాగం రెవెన్యూ సమస్యలు పట్టా పాస్ పుస్తకాలు 1బి అడంగల్ , ముటేషన్ వంటి సమస్యలు రావడం జరిగిందన్నారు అదేవిధంగా పంట నష్టపరిహారం తో పాటుగా 60 సంవత్సరాలు దాటిన వారికి వద్ధాప్య పెన్షన్లు ఒంటరి మహిళ వీడో పెన్షన్లు ఇల్లు లేని వారు ఇంటి కోసం వినతలు సమర్పించడం జరిగిందన్నారు తెలుగుదేశం పార్టీ ప్రజల కోసం పనిచేస్తుందని అన్నారు ప్రజా సమస్యల పరిష్కారానికి ముందుండే ఏకైక పార్టీ తెలుగుదేశం పార్టీ అన్నారు ఈ కార్యక్రమంలో విజయనగరం మండల పార్టీ అధ్యక్షులు బొద్దల నర్సింగరావు, కార్యదర్శి గంటా పోలి నాయుడు, ఎంపీటీసీలు రాజేష్ బాబు, వేచలపు శ్రీనివాసరావు, కంది సాయి జగ్గారావు, చొప్ప రామారావు, బొబ్బాది ఈశ్వరరావు, పడగల రామకష్ణ, వెన్ను శ్రీనివాసరావు, తుమ్మల గంటి రామారావు , కొసర శివ, సుంకర పైడ్రాజు, జిల్లా కార్యదర్శి ఐవిపి రాజు టౌన్ అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పరిహారం ఇవ్వకుండా రహదారి పనులు

ప్రజాశక్తి - భోగాపురం

రైతులకు చెప్పకుండా ఇష్టానుసారంగా తమకు నచ్చిన చోట వరకు రహదారి పనులను చేపట్టడంతో ఓ రైతు సోమవారం తహశీల్దారుకు ఫిర్యాదు చేశాడు. గూడెపులస రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబరు 421లో భోగాపురం గ్రామానికి చెందిన మాతా శిరోమణికి భూమి ఉంది. ఈ భూమిలో 27 సెంట్లను అప్రోచ్ రోడ్డు నిమిత్త ప్రభుత్వం తీసుకుంది. దీనికి నష్ట పరిహారాన్ని రైతు బ్యాంకు ఖాతాలో వేశారు. ఆ తరువాత పరిహారం చెల్లించకుండా మరో 33 సెంట్లకు రహదారి కోసం సర్వే రాళ్లు వేశారు. దీనిపై పరిహారం చెల్లించాలని గతేడాది నుంచి రైతు పోరాటం చేస్తున్నారు. కాని ఇప్పటి వరకు పరిహారం ఇవ్వలేదు. ఇంతలో గతంలో వేసిన సర్వే రాళ్ళకు మించి మళ్ళి మరో పది సెంట్లు అదనంగా ఇటీవలి కొత్త రాళ్ళను వేశారు. దీనిపై రైతు ఎవరిని అడగాలో తెలియక స్థానిక రెవెన్యూ అధికారులకు మహిళా రైతు ఫిర్యాదు చేశారు. తమకు నష్ట పరిహారం ఇవ్వకుండా విమానాశ్రయ సంస్థ తాత్కాలిక రహదారిని కూడా వేసేశారని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత రహదారిని జెసిబితో తవ్వించేస్తామని రైతు హెచ్చరించారు దీనిపై తహశీల్దారు సురేష్ మాట్లాడుతూ ఈ విషయాన్ని ఆర్‌డిఒ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు ప్రయత్నిస్తామని చెప్పారు.



విద్యార్థులను అభినందిస్తున్న సీతం కళాశాల కరస్పాండెంట్ శశిభూషణరావు

విద్యార్థులకు కరాటే ఛాంపియన్ షిప్‌లో పతకాలు

ప్రజాశక్తి-విజయనగరం

సత్య కళాశాలలో కరాటేలో కోచ్ సంతోష్ కుమార్ ఆధ్వర్యం లో శిక్షణ పొందుతున్న విద్యార్థులకు విశాఖలో జరిగిన రాష్ట్ర ఓపెన్ కరాటే ఛాంపియన్‌షిప్ పోటీల్లో పతకాలు సాధించారు. గంటా కనక రావ్ మెమోరియల్ ఇన్విటేషనల్ ఇంటర్ స్టేట్ కరాటే ఛాంపియన్‌షిప్ జరుగుతోంది. ఈపోటీల్లో కె.సంతోష్ కుమార్, పి.హేమంత్ గోల్డ్, సిల్వర్ పతకాలు, పిపి కుస్వర్ధ్ కుమార్, కె. శివ సిల్వర్, బ్రాంజ్, బి. రేశ్వంత్, ఎం.సాత్విక్, పి.భార్గవ్, బి.జోగేంద్ర, బి.సమీక్ష కాంస్యం, బి.శ్రీఖర్, జె.శరత్, బి.హర్ష రజత పతకాలు సాధించారు. సందర్భంగా వీరిని కళాశాల సంచాలకులు డాక్టర్ ఎం శశి భూషణ రావు, ఎన్‌సిసి ఆఫీసర్ కెప్టెన్ సత్యవేణి , ఫిజికల్ డైరెక్టర్లు మహేష్, ప్రసాద్ తదితరులు అభినందించారు.

వెదుళ్లవలస రైతుల ఆందోళన బాట

ప్రజాశక్తి- గరివిడి

మండలంలోని వెదుళ్లవలస గ్రామ వ్యవసాయ రైతులు ఆందోళన బాట పట్టారు. ఆ గ్రామ రెవెన్యూ పరిధిలో ఉన్న సర్వే నెంబర్ 215-3, 216-3 ప్రభుత్వ భూమి రస్తాగా ఉంది. ఈ భూమిలో అక్రమనిర్మాణాలు జరుగుతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ రస్తా చీపురుపల్లి నుంచి బిల్లలవలస గ్రామానికి వెళ్లే బీటీ రోడ్డును ఆనుకొని ఉంది. ఈ రహదారి నుంచి రస్తా మీదుగా పలు చెరువులు కింద ఉన్న ఆయకట్టు పొలానికి వెళ్లేందుకు వందల ఏళ్ల నుంచి వినియోగంలో ఉంది. ఈ చెరువులు కింద సుమారు 200 ఎకరాల విస్తీర్ణంలో భూమికి సంబంధించి 50 మంది వరకూ రైతులు ఈ రస్తానే వినియోగించుకుంటున్నారు. చీపురుపల్లి - బిళ్ళలవలస వలస పోవు ఆర్ అండ్ బి రోడ్డుకు ఆనుకుని పైన తెలిపిన సర్వే నెంబర్‌లో ప్రభుత్వ భూమిలో గ్రామస్తుడు మన్నెపూరి సత్యనారాయణ రస్తా రహదారిని మూసివేసి నిర్మాణం చేపడుతున్నారు. అక్రమ నిర్మాణం వల్ల దిగువ ఉన్న రైతుల పంట పొలాలకు వెళ్లేందుకు ట్రాక్టర్‌లు, చెరుకు లారీలు, ఎడ్ల బళ్ళు, బోర్ వెల్ లారీలకు దారి లేకుండా పోయింది. ఈ నేపథ్యంలో అక్రమ నిర్మాణం ఆపాలని సోమవారం గ్రీవెన్సులో కలెక్టర్ అంబేద్కర్‌కు ఫిర్యాదు చేశారు.

స్టాంప్ డ్యూటీ నిధులు పంచాయతీలకు జమ చేయాలి

ప్రజాశక్తి - భోగాపురం

రిజిస్ట్రేషన్లకు సంబంధించిన స్టాంప్ డ్యూటీ నిధులను పంచాయతీలకు జమ చేయాలని సర్పంచులు భోగాపురం సబ్ రిజిస్టార్ రామకృష్ణకు సోమవారం వినతి పత్రం అందజేశారు. భోగాపురం, పూసపాటిరేగ, డెంకాడ మండలాల్లోని పంచాయతీలకు, మండల పరిషత్తులకు 2022 నుంచి జమ కావడం లేదని ఆయనకు తెలిపారు. దీని వల్ల పంచాయతీల్లో అభివృద్ధి కార్యక్రమాలకు ఆటంకం ఏర్పడు తుందని చెప్పారు. దీనిపై సబ్ రిజిస్టార్ మాట్లాడుతూ ఇప్పటికే దీనిపై ఈ నెల 26వ తేదీన ఎంపిపి అనూష రెడ్డి ఫిర్యాదు చేసి ఉన్నారని తెలిపారు. ఈ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఉపాధి హామీ కాంపౌండెంట్ మెటీరియల్ పనులను సర్పంచులకు ఇవ్వకుండా వెండర్లతో పనులు చేయించడం దారుణమని సర్పంచులు అన్నారు. ఈ మేరకు ఎంపిడిఒ కిరణ్ కుమార్‌కు సోమవారం వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల ఉపాధ్యక్షులు ఉప్పాడ సూర్యనారాయణ రెడ్డి, సర్పంచులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలి

ప్రజాశక్తి-విజయనగరంకోట

పోలీసు అమరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో సోమవారం తిరుమల-మెడికవర్ ఆసుపత్రి వైద్య బృందం వైద్య శిబిరాన్ని నిర్వహించి, పోలీసులకు, వారి కుటుంబ సభ్యులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఎస్‌పి వకుల్‌జిందాల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు అంతర్గత భద్రతకు పోలీసుశాఖ శక్తి వంచన లేకుండా పని చేస్తూ, తమ ఆరోగ్యాలపై ప్రత్యేక శ్రద్ధ వహించక పోవడం వలన, అనారోగ్యం పాలవుతున్నారన్నారు. ఆరోగ్యపరమైన ఇబ్బందులను ఎదుర్కొంటూ, విధి నిర్వహణలో ప్రాణాలను సైతం కోల్పోతున్నారన్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. పోలీసు కుటుంబాలు, సామాన్య ప్రజలు సుమారు 65మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులను పంపిణీ చేసారు. కార్యక్రమంలో అదనపు ఎస్‌పి పి.సౌమ్యలత, ఎఆర్ అదనపు ఎస్‌పి జి.నాగేశ్వరరావు, సిఐలు లీలారావు, బి.వెంకటరావు, ఎస్.శ్రీనివాస్, టి.శ్రీనివాసరావు, ఆర్‌ఐలు పాల్గొన్నారు.

అంతర్ విశ్వవిద్యాలయాల కబడ్డీ పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి - నెల్లిమర్ల

ఈ నెల 30 నుండి అక్టోబర్ 2 వరకు తమిళనాడు రాష్ట్ర రాజధాని చెన్నై నగరంలో జరగబోయే దక్షిణ భారత అంతర్ విశ్వవిద్యాలయాల కబడ్డీ ఛాంపియన్ షిప్ పోటీలకు నగర పంచాయతీకి చెందిన గండ్రేటి జనార్ధన్, లెంక కైలాష్ ఎంపికయ్యారని తెలిపారు. సోమవారం సికెఎం ప్రభుత్వ జూనియర్ కళాశాల రిటైర్డు పీడీ, కోచ్ బొమ్మన రామారావు ఎంపికైన క్రీడాకారులను అభినందించారు. వీరిద్దరూ ఆంధ్ర విశ్వవిద్యాలయం జట్టు తరుపున పాల్గొంటారని చెప్పారు. జాతీయ స్థాయిలో ఎంపికైన క్రీడాకారులను ఆయనతో పాటు నెల్లిమర్ల కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు బోని సూర్యనారాయణ నాయుడు, సంఘ సభ్యులు, సీనియర్ క్రీడాకారులు నగర పంచాయతీ పెద్దలు అభినందించారు.

ఉచిత గ్యాస్‌కు ఇవీ అర్హతలు

ప్రజాశక్తి - విజయనగరం

రాష్ట్రప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో భాగంగా దీపావళి నుంచి ఉచిత గ్యాస్ సిలెండర్లు ఇచ్చేందుకు నిర్ణయించిన విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో లబ్ధిదారులు ఆధార్‌కార్డు, బియ్యం కార్డుతో పాటు ఆధార్ నెంబరుతో లింకు చేసిన బ్యాంకు ఖాతా, గ్యాస్ కనెక్షన్‌నెంబరు కలిగి ఉండాలని జాయింట్ కలెక్టర్ సేతుమాధవన్ తెలిపారు. ఈనెల 31న తొలి సిలిండర్, వచ్చేఏప్రిల్ నుంచి జులై వరకు, ఆగస్టు నుంచి నవంబర్, డిసెంబర్ నుంచి మార్చి వరకు 3 సిలిండర్లు పొందవచ్చునని తెలిపారు.

అండర్-14 జిల్లా జట్లు ఎంపిక

ప్రజాశక్తి - పూసపాటిరేగ

మండలంలోని పూసపాటిరేగ జెడ్‌పి ఉన్నత పాఠశాలలో సోమవారం జిల్లాస్థాయి అండర్ 14 క్రికెట్ పోటీలకు జిల్లా జట్టు ఎంపిక నిర్వహించారు. 68వ స్కూల్‌గేమ్స్ రాష్ట్ర స్థాయి పోటీలలో భాగంగా జిల్లాలో మొత్తం పాఠశాలల నుంచి క్రికెట్ క్రిడాకారులు హాజరయ్యారు. పూసపాటిరేగ హైస్కూల్‌లో నూతనంగా నిర్మించిన ఆస్ట్రియో టాప్ నెట్స్‌లో ఈ ఎంపికలు జరిగాయి. ముందుగా నూతన ఆస్రియో టాప్‌నెట్స్‌ను హెచ్‌ఎం ఎం. శంకరావుతోపాటు పాఠశాల చైర్మన్, దాతలు సంయుక్తంగా ప్రారంభించారు. ఎస్‌ఎఫ్‌జి కార్యదర్శి కె. కృష్ణంరాజు, నియోజకవర్గ ఇంచార్జి జి. తవిటయ్య, మండల ఇంచార్జి లీలాకృష్ణ, సెలక్షన్ కమిటీ మెంబర్ పి.బంగారురాజుతోపాటు పలువురు దాతలు పాల్గొని జిల్లా స్థాయిలో 16 మందిని ఎంపిక చేశామన్నారు. వీరంతా నవంబర్ 5 నుంచి 7 వరకూ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

సమస్యల పరిష్కారానికి గ్రీన్ అంబాసిడర్ల ధర్నా


ఎంపిడిఒ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న గ్రీన్ అంబాసిడర్లు

ప్రజాశక్తి- రేగిడి

గ్రామ సచివాలయ పరిధిలో పనిచేస్తున్న గ్రీన్ అంబాసిడర్లు జీతభత్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారని వారి సమస్యలు తక్షణమే పరిష్కరించాలని సిఐటియు ఆధ్వర్యంలో ఎంపిడిఒ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ మేరకు సోమవారం 25 సచివాలయాల అంబాసిడర్ల యూనియన్ అధ్యక్షులు కురమాన పెంటయ్య, తేగల ఆదినారాయణ అధ్యక్షతన సిఐటియు జిల్లా అధ్యక్షులు పి. శంకరరావు, మండల నాయకులు మడపాన త్రినాథ్, కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు శంకరరావు మాట్లాడుతూ సచివాలయ పరిధి గ్రామాల ప్రజల ఆరోగ్యం కోసం తమ ఆరోగ్యాన్ని పణంగా పెట్టి గ్రామాల్లో పారిశుధ్యం నిర్వహిస్తున్న గ్రీన్ అంబాసిడర్లకు 15 నెలలుగా జీతాలు ఇవ్వకపోవడం దారుణమన్నారు. పనిచేసే చోట కార్మికులకు కనీసం బ్లౌజులు, యూనిఫారాలు కూడా ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. చెత్త ఎత్తడానికి రిక్షాబళ్లకు రిపేర్లు వస్తే కార్మికులు సొంత డబ్బులతో చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులకు తక్షణమే కనీస వేతనం రూ.10వేలు అమలు చేయాలని, బకాయి జీతాలు వెంటనే చెల్లించాలని, యూనిఫారం, బ్లౌజులు ఇవ్వాలని రిక్షా రిపేర్లకు పంచాయతీలే భరించాలని కోరుతూ ఎంపిడిఒ శ్యామల కుమారికి వినతి పత్రం అందజేశారు. సమస్యలు వెంటనే పరిష్కరించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గ్రీన్ అంబాసిడర్‌లు పాల్గొన్నారు.

విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ

ప్రజాశక్తి-బాడంగి

విజయనగరం, శ్రీకాకుళం, మన్యం జిల్లాల్లో చదువుతున్న 100 మంది పేద విద్యార్థులకు వసుదైక కుటుంబం (వికె) ట్రస్టు ద్వారా సోమవారం బొబ్బిలి ఎమ్మెల్యే బేబినాయన సైకిళ్లను పంపిణీ చేశారు. తల్లి, తండ్రి లేని పిల్లలకు అమెరికాలో స్థిరపడ్డ రెళ్ల జానకి రామయ్య కుమారుడు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వసుదైక కుటుంబం ట్రస్ట్ తరపున వీటిని అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వెనుకబడిన ప్రాంతాల్లో అనాథ విద్యార్థుల చదువు కొనసాగేలా వికె ట్రస్టు చేయూత ఇవ్వడం అభినందనీయమన్నారు. వికె ట్రస్ట్ డైరెక్టర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ వికలాంగుల కోసం ప్రత్యేక ఉపాధ్యాయులు కొల్లి ఈశ్వరరావు చేపడుతున్న సేవా కార్యక్రమాలను సోషల్ మీడియాలో చూసి, ఆగస్టులో 30 మందికి సైకిళ్లను అందజేశామన్నారు. ప్రస్తుతం 100 మందికి సైకిళ్లను అందించామని చెప్పారు. భవిష్యత్తులో మెరిట్ స్కాలర్‌షిప్ కూడా ఇస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి పెద్దింటి రామారావు, వైస్ ఎంపిపి భాస్కరరావు, ఎంపిటిసి శ్రీనివాసరావు సర్పంచ్ కె.రమేష్, తెంటు రవి, బెనర్జీ, ఎంఇఒలు రాజేశ్వరి, లక్ష్మణదొర, హెచ్‌ఎం దత్తి సత్యనారాయణ పాల్గొన్నారు.


సైకిళ్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బేబినాయన